క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


సన్మానం చేస్తున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లీశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ యుగంధర్, ఏఎన్‌ఎంలు శశికళ, విజయలక్ష్మి, మెహరా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీలో బదిలీ అయిన వారికి తహసీల్దార్ మునివేలు, ఇన్‌చార్జ్ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీరు చేసి వైద్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాళాపురంలో పొలంబడి

విడపనకల్లు: మండల పరిధిలోని మాళాపురంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కంది పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కంది పంట ఆకుకు పురుగు పడితే వేపానూనె 5 ఎంఎల్‌ను లీటర్ నీరులో కలుపుకొని పంటకు పిచికారీ చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తెనగల్లు విద్యార్థులు


విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం దస్తగిరి

కుందుర్పి: తెనగల్లు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం దస్తగిరి, పీఈటీ మహేష్ మంగళవారం తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సబ్ జూనియర్స్ బాలుర బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు శివాజీ(9వ తరగతి), రామ్‌చరణ్(10వ తరగతి) ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. వీరు త్వరలో ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం, పీఈటీ తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

విడపనకల్లు: రైతులను ఆదుకోవడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బోయ వెంకటేశులు,సురేష్,ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, అంజనయ్య, నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కౌలు రైతు సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభమైనా నేటికీ అన్నదాత సుఖీభవ పథకం కింద ఇంత వరకూ రైతుల ఖాతాలోకి రూ.20 వేలు జమ చేయకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. ఎరువుల కొరత కూడా పట్టిపీడిస్తోందని, వెంటనే ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

అంతా మా ఇష్టం !



కూడేరు: మధ్యాహ్నమైనా తెరచుకోని తలుపులు

కూడేరు: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం మంగళవారం మధ్యాహ్నం 1 గంటదాటిన తలుపులు తెరుచుకోలేదు. ఇక్కడ ఏఓ, ఇద్దరు ఏఈఓలు, వీహెచ్‌ఏ, వీఏఏలు పని చేస్తున్నారు. కడదరగుంటతో పాటు మరికొన్ని గ్రామాలకు చెందిన పలువురు రైతులు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపుకుగాను వేలి ముద్ర వేసేందుకు, ఇతర పనుల నిమిత్తం ఉదయమే కార్యాలయం వద్దకు వచ్చారు. తలుపులు తెరవకపోవడంతో చాలా సేపు అక్కడే వేచి ఉన్నారు. అధికారులు వస్తారో? రారో తెలుసుకుందామని ఓ రైతు ఉన్నతాధికారి సెల్ నంబర్ తెలుసుకుని ఫోన్ చేస్తే క్యాంపులో ఉన్నాం. కాస్త ఆలస్యంగా వస్తామని చెప్పడంతో కొంత సేపు వేచి చూశారు. మధ్యాహ్నం 1:20 గంటల తర్వాత అధికారులు వచ్చారు. మండల కేంద్రంలోనే ఉద్యోగులు సక్రమంగా విధులకు రాకపోతే ఎలా? రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండల పరిధిలోని అరవకూరు చెరువు క్రాస్ వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఈరన్న గౌడ్, రాజేష్ గాయపడ్డారు. అనంతపుం నుంచి బళ్లారికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా క్రాస్ వద్ద అదుపు తప్పి కిందపడిపోవడంతో ఘటన జరిగింది.

రైతులకు కర్ర కష్టాలు

- టమాట పంటకు ఊత కర్రలు దొరక్క అవస్థలు
- ఒక్కో నీలగిరి కర్ర రూ.12 నుంచి రూ.15తో కొనుగోలు
- పొరుగు రాష్ట్రం నుంచి దిగుమతి


టమాట సాగులో కర్రలు నాటుకున్న దృశ్యం, కర్ర సహాయంతో ఏపుగా పెరిగిన టమాట పంట

రాయదుర్గం: టమాట రైతులకు 'కర్ర' కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో టమాట పంట సాగయ్యే కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలు మొదటి, రెండో స్థానాల్లో నిలుస్తాయి. అయితే ఈ ప్రాంతాల్లో అధిక శాతం మంది బోరుబావుల కింద పంట సాగు చేస్తారు. రైతులు అధిక దిగుబడినిచ్చే కొత్త రకం నారు ఎంచుకుంటున్నారు. దీంతో టమాట కాయల బరువుకు మొక్క నేలవాలితే పొలాల్లోనే కుళ్లిపోతాయి.. దీంతో రైతులు మొక్కలకు ఊతంగా కర్రలు నాటుతుండడంతో డిమాండ్ పెరిగింది. ఈప్రాంతంలో కర్రలు దొరక్క కర్ణాటకకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుండడంతో కష్టాలు పడాల్సి వస్తోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఏటా సీజన్‌తో పని లేకుండా సుమారు 40 వేల ఎకరాలకు పైగా టమాట సాగు చేస్తారు. ఇందులో సుమారు 28 నుంచి 30 వేలకు పైగా ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గం నియోజకవర్గంలోనే టమాట పంట సాగులోకి వస్తోంది. దీని కోసం రూ.లక్షలు పెట్టుబడులకు ఖర్చు చేస్తారు. నష్టాలను సైతం లేక్క చేయకుండా.. ఏదో ఒక రోజు అదృష్టం పండక పోతుందా?.. పెట్టుబడికి చేసిన అప్పు తీరక పోతుందా? అంటూ పంట సాగు చేస్తున్నారు. ఈ పంట జాక్‌పట్ లాంటిదని, పంట సాగు కంటే మొక్కకు సపోర్టుగా వినియోగించే ఊత కర్రలు సమకూర్చుకోవడం రైతుకు భారమవుతోంది. జిల్లాలో ఆశించిన స్థాయిలో నీలగిరి, వెదురు, ఇతర కలప లేకపోవడంతో వాటికి డిమాండ్ ఎక్కువైంది.

కర్ణాటక నుంచి దిగుమతి

టమాట సాగుకు అవసరమయ్యే నీలగిరి, వెదురు పొరుగు రాష్ట్రం కర్ణాటకలో ఆశించిన స్థాయిలో లభిస్తోంది. దీంతో అక్కడ టన్ను లేదా కర్ర ప్రకారం కొనుగోలు చేసి, రవాణా చేసుకోవాల్సి వస్తోంది. ఒక్కో కర్ర రూ.12 నుంచి రూ.15 చెల్లించాలి. ఆర్థిక స్థోమత లేని రైతులు గట్టు వెంట జాలి, ఇతర కర్రలు నాటుతున్నారు.

రెండు వేల కర్రలు అవసరం

ఎకరాకు ఎనిమిది వేలు టమాట నారు నాటాలి. నాలుగు మొక్కలకు ఒక కర్ర చొప్పున ఎకరాకు రెండు వేల కర్రలు అవసరం. ఎకరాకు సరిపడే కర్రలకు రూ.32 వేల నుంచి రూ.40 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కల సుమారు 40 నుంచి 50 వేల ఎకరాలకు అవసరమయ్యే కర్రల కోసం రైతులు రూ.లక్షలు ఖర్చు చేయాలి వస్తోంది. కర్రలు నాటడం వల్ల పంట దిగుబడితో పాటు కాయ నాణ్యత వస్తోంది. దీనికి మార్కెట్లో డిమాండ్ ఉంటుంది. దీంతో ఊత కర్రలతో పంట సాగుకు రైతులు మొగ్గుచూపుతారు.

కర్రలు రాయితీపై అందించాలి



టామాట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఉద్యానశాఖ ద్వారా రాయితీపై ప్లాస్టిక్ పైపులు అందించాలి. ఫలితంగా కర్రల కోసం వృక్షాలు నరికి వేయకుండా కాపాడుకోవచ్చు. కర్రలు కొనుగోలు చేసినా రెండు పంటలకు మించి రావడం లేదు. ఆధునిక పద్ధతిలో టమాట పంటను ప్రోత్సహిస్తే ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుంది. టమాట సాగు రైతులంతా కర్ణాటక నుంచి కర్రలు తెప్పించుకోవాల్సి వస్తోంది.

– సుధాకర్‌రెడ్డి, రైతు, పూలకుంట

25న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం


మాట్లాడుతున్న కురుబ రమేష్, నాయకులు

విడపనకల్లు: మండల కేంద్రంలో ఈనెల 25న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కురుబ రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఉప కన్వీనర్ బోయ నాగేంద్ర, జిల్లా కార్యదర్శి భరత్‌రెడ్డి, ఎస్సీసెల్ నాయకులు సుంకన్న, సీనియర్ నాయకులు కరణం భీంరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కురుబ గిరిబాబు మాట్లాడారు. సమావేశానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నాయకత్వంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 25న మధ్యాహ్నం నిర్వహించే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. సమావేశంలో హావళిగి ఎంపీటీసీ కురుబ రాజశేఖర్, నాయకులు జనార్దనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో చంద్రబాబు మోసం

- నిధులు లేక పంచాయతీలు భ్రష్టు పట్టాయి
- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ సభ్యుల ఆగ్రహం


ప్రభుత్వ తీరుపై ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ సభ్యులు

ఉరవకొండ/ఉరవకొండ రూరల్: అబద్ధపు హామీలు ఇచ్చి అన్ని వర్గాలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసగించారని, ఏడాది పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఉరవకొండ మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో వైఎస్సార్‌సీపీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నేల మీద కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, సర్పంచ్‌లు మీనుగ లలితమ్మ, మోగేంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఈశ్వర్, వన్నూర్ సాబ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,122 కోట్లు విడుదల చేసినా కూటమి ప్రభుత్వం ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించుకుందన్నారు. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పాలన భ్రష్టు పట్టిందన్నారు. చంద్రబాబు రైతులకు అబద్ధపు హామీలు ఇచ్చి మోసగించారని విమర్శించారు. నేటికీ అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయకుండా రైతులను మోసగించారన్నారు. రైతుల భారం పడకుండ బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ప్రస్తుతం రైతులు ఎకరాకు వేరుశనగకు రూ.640, కందికి రూ.80 రైతులే చెల్లించడం దారుణమన్నారు. నాడు–నేడు కింద అర్ధాంతరంగా ఆగిన పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉరవకొండ పట్టణంలో పలు ట్యాంకులను అధికారులు శుభ్రం చేయడకం లేదని, ఫలితంగా రంగు మారిన నీరు వస్తోందని మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, ఎంపీటీసీ వన్నూర్‌సాబ్... ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగ్గయ్యను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిప్రసాద్ ఎంపీటీసీ వెంకటేష్, సర్పంచ్‌లు మేకల సిద్దార్థ్, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోంది'


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని, ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు ఇందుకు నిదర్శమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కన్వీనర్ ఈడిగ సుధీర్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం లిక్కర్ కేసులో అక్రమంగా అరెస్టు చేసి ఆనందం పొందుతోందన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపుచర్య అని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నేతలు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు మంచిది కాదన్నారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మాని సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పరమేశ్వరప్ప, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయుల యాదవ్, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు బోరంపల్లి కృష్ణారెడ్డి, గూబనపల్లి నాగరాజు, బిక్కి హరి, యూత్ వింగ్ చరణ్, టైలర్ శీన, ఓంప్రకాష్, పరంధామరెడ్డి, కిరిటీ, జాకీర్, రాజు, సురేష్, తిప్పన్న, గోవిందు, మల్లి, అనిల్, దేవా తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన యువకుడి అప్పగింత


భరత్‌ను తండ్రికి అప్పగిస్తున్న త్రీ టౌన్ సీఐ శాంతిలాల్

అనంతపురం: బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన శ్రీరాములు తన కుమారుడు భరత్ (బుద్ధిమాంద్యుడు)తో సహా హైదరాబాద్ వెళ్లి మంగళవారం ఉదయం అనంతపురం ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. కళ్యాణదుర్గం బస్సు ఎక్కాల్సి ఉంది. బస్టాండులో తండ్రి శ్రీరాములు మరుగుదొడ్డికి వెళ్లారు. తిరిగొచ్చాక భరత్ కనిపించలేదు. వెంటనే అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తన కుమారుడు అదృశ్యం అయినట్లు శ్రీరాములు ఫిర్యాదు చేశారు. సీఐ శాంతిలాల్ స్పందించి కేసు నమోదు చేయించడంతో పాటు బుద్ధిమాంద్యం యువకుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఆర్టీసీ బస్టాండు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. బద్వేలు బస్సు ఎక్కాడని సీసీ కెమెరాల ద్వారా పసిగట్టారు. బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద బస్సును ఆపి భరత్‌ను తండ్రికి అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీరాములు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా షంషీర్ ఊరేగింపు


షంషీర్‌ను అశ్వంపై ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: యర్రగుంట గ్రామంలో పీరాషావలి షంషీర్ ఊరేగింపు మంగళవారం వేకువజామున ఘనంగా జరిగింది. పీరాషావలీ వారి ప్రతిరూపంగా భావించే షంషీర్‌ను పూలతో ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై పురవీధుల్లో ఊరేగించారు. దర్గా నుంచి గ్రామ నడిబొడ్డు వరకు షంషీర్ ఊరేగింపు కొనసాగింది. భక్తులు పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన చిన్న మొహర్రం


కలుగోడులో ఊరేగుతున్న పీర్లస్వాములు

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, గుమ్మఘట్ట గ్రామాల్లో చిన్న మొహర్రం ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా పీర్ల స్వాములకు భక్తులు చక్కెర, బెల్లంతో చదివింపులు చేయించి, గ్రామాల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. యువకులు అగ్నిగుండం చుట్టూ తప్పెట్ల నడుమ అలావ్ తొక్కి, అనంతరం పీర్లను జలధికి తరలించారు. ఎస్‌ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం


తిప్పేస్వామిని సన్మనిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా మరోసారి నియమితులైన బోయ తిప్పేస్వామిని మంగళవారం ఆ పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి తనను నియమించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, సహకరించిన జిల్లా అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డికి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేశులు, జిల్లా అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, నాయకులు అంజనేయులు, కిరిటీ యాదవ్, తలారి వంశీ, తిమ్మప్ప, మల్లి, జాకీర్, కృష్ణరెడ్డి, అనిల్, అంజి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న ట్రాఫిక్


బళ్లారి రోడ్డులో వాహనదారుల అవస్థలు నిత్యం ఇలా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు హడలెత్తిస్తున్నారు. బళ్లారి రోడ్డు వినాయక సర్కిల్ నుంచి బొడ్డురాయి వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. రోడ్డు విస్తరణ జరగకపోవడం, రోడ్డు మార్జిన్‌కు అనుకుని వ్యాపారాలు, అంగళ్లు, వాహనాలు, ప్యాసింజర్ ఆటోల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య తారస్థాయికి చేరింది. బళ్లారికి వెళ్లే ప్రైవేటు, ఆర్టీసీ బస్సులన్నీ అరబిక్ కళాశాల వద్ద నిలుపుతుండడంతో అక్కడ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. బళ్లారి వైపు నుంచి వచ్చే బస్సులన్నీ వినాయక సర్కిల్ వద్ద ప్రయాణికులను దింపుతుండడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణచర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

హామీల అమలులో విఫలం

రాయదుర్గంటౌన్: హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ విమర్శించారు. ఆగస్టు 12, 13, 14 తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సాయంత్రం రాయదుర్గంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జ్ నాగార్జునతో కలిసి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప, ఉవరకొండ ఇన్‌చార్జ్ మల్లికార్జున, నాయకులు గౌస్, తిప్పేస్వామి, కొట్రేష్, అంజి, దుర్గన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయండి

విడపనకల్లు: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు వేయాలని మాల మహానాడు నాయకులు మొలక బాల రామాంజి నేయులు ఎంపీడీఓ షకీలాబేగంకు మంగళవారం కోరారు. గత ఇరవై సంవత్సరాలుగా హాస్పిటల్‌కు వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా ఉందని, ఇప్పటికైనా రోడ్డు వేసి రోగులకు, స్థానికులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

విడపనకల్లు: పాల్తూరులో సర్పంచు బీవ్లారాణి ఆధ్వర్యంలో మంగళవారం జేసీబీతో శ్మశానంలో ముళ్ల పొదలు తొలగించారు. శ్మశానాన్ని శుభ్రం చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

25న వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 25న వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ సునిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడండి

కణేకల్లు: భూసార పరీక్షల నివేదికల ఆధారంగా ఎరువులను వాడాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ లక్ష్మీ నరసింహులు, కణేకల్లు ఏఓ జగదీష్ రైతులకు సూచించారు. బెణికల్లులో మంగళవారం పంట సాగులో తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓలు మాట్లాడుతూ ఇష్టానుసారంగా ఎరువులు వాడవద్దన్నారు.

తలిదండ్రుల చెంతకు బాలుడు

కళ్యాణదుర్గం రూరల్: తప్పిపోయిన ఓ బాలుడు పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాలు.. కంబదూరు కోట కాలనీకి చెందిన ఆదిత్య అనే బాలుడు మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈక్రమంలో డ్యూటీ ముగించుకుని కళ్యాణదుర్గం వైపు వెళుతున్న కంబదూరు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్‌కు కంబదూరు చెరువు కట్ట సమీపంలో కనిపించాడు. వెంటనే బాలుడి వివరాలు సేకరించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సమాచారం అందుకున్న బాలుడి తల్లిదండ్రులు పోలీసులను సంప్రదించారు. డీఎస్పీ రవిబాబు సమక్షంలో బాలుడిని వారికి అప్పగించారు.

డ్రిప్ పరికరాలు సద్వినియోగం చేసుకోండి

బెళుగుప్ప: ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లి, బెళుగుప్ప తదితర గ్రామాల్లో మండల ఎంఐఓ మల్లేష్, వివిధ డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో కలసి వ్యవసాయ తోటల్లో డ్రిప్ ఇరిగేషన్ సిస్టంను పరిశీలించారు.

ఆపస్ మండల కన్వీనర్‌గా మలోబన్న

బెళుగుప్ప: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అపాస్ (ఏపీయూఎస్)బెళుగుప్ప మండల కన్వీనర్‌గా బి.మలోబన్న ఎన్నికైనట్లు అపాస్ జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మలోబన్న తెలిపారు.

వెండి ఆభరణాల చోరీ

కళ్యాణదుర్గం రూరల్: గోళ్ల గ్రామంలోని మారెమ్మ ఆలయంలో వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం పూజలు చేసేందుకు గుడి తలుపులు తీయగా వెండి ఆభరణాలు చెల్లాచెదురుగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు అనుమానించి పోలీసులకు సమాచారం అందిచారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సుమారు రూ.80 వేల విలువైన ఆభరణాలు(15 వెండి గొడుగులు) చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

బెళుగుప్ప: మండల పరిధిలోని బెళుగుప్ప, దుద్దేకుంట గ్రామాల్లో బదిలీ ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. దుద్దేకుంటలో హెచ్‌ఎం బాల మురళీకృష్ణ అధ్యక్షతన ఉపాధ్యాయులు సాయి ప్రసాద్, రాఘవేంద్రలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. బెళుగుప్ప ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మీపతి అధ్యక్షతన బదిలీ ఉపాధ్యాయులు వరప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, తిరుమలరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, సర్పంచ్ రత్నమ్మ, పాఠశాల కమిటీ చైర్మెన్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పీ4 లబ్ధిదారుల పునఃపరిశీలనకు వార్డు సభలు

రాయదుర్గంటౌన్: జీరో పావర్టీ పీ4 సర్వేలో ఎంపికైన బంగారు కుటుంబాల లబ్ధిదారుల పునఃపరిశీలనకు ఈ నెల 23 నుంచి 29 వరకు సచివాలయాల వారీగా వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వార్డు సభల షెడ్యూల్ విడుదల చేశారు.

తపాలా శాఖలో 2.0 సేవలు ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని తపాలా కార్యాలయంలో మంగళవారం 2.0 సేవలను ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇచ్చి వేగవంతమైన సేవలను అందించడానికి కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. పోస్ట్ మాస్టర్ పద్మావతి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

గుమ్మఘట్ట: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్‌ఐ ఈశ్వరయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శు(ఎంఎస్‌కే)లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు ఎస్‌ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్

రాయదుర్గంటౌన్: పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత మంచినీటి పథకం కింద కణేకల్లులోని సమ్మర్ స్టోరేజ్ (ఎస్ఎస్) ట్యాంకులోకి హెచ్చెల్సీ నుంచి నీటి పంపింగ్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఎస్ఎస్ ట్యాంకు నీటి నిల్వ సామర్థ్యం 3,052 మిలియన్ లీటర్లు కాగా ప్రస్తుతం 1,146 మిలియన్ లీటర్ల నీరు నిల్వ ఉంది. దాదాపు 60 హెచ్‌పీ కెపాసిటీ గల నాలుగు మోటార్ల ద్వారా నిరంతరం నీటి పంపింగ్ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. కాలువలో నీరున్నంత వరకు పంపింగ్ చేసి, ట్యాంకులో నీరు పూర్తిస్థాయికి చేరుకునేందుకు అన్ని చర్యలూ చేపడతామన్నారు.

కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

రాయదుర్గంటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల సమ్మెను మంగళవారం నుంచి తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. కార్మికుల పోరాటానికి స్పందించిన ప్రభుత్వం ప్రస్తుతం ఇంజినీరింగ్ కార్మికులకు ఇస్తున్న రూ.15 వేల జీతానికి అదనంగా మరో రూ.3,500 పెంచుతూ జీఓ 124 విడుదల చేసినట్లు చెప్పారు. అయితే ఈ వేతన పెంపుపై కార్మికులు సంతృప్తికరంగా లేరన్నారు. సంక్షేమ పథకాల అమలు, సమ్మె కాలపు వేతనాన్ని కార్మికులకు అందించడంపై సానుకూలంగా స్పందించడంపై సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు చెప్పారు.